క్లుప్తంగా

వృద్ధులకు ఆసరాగా కంటి వెలుగు


కళ్లను పరీక్షిస్తున్న వైద్యులు

జి.సిగడాం: వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగించుకోవాలని వైస్ ఎంపీపీ తోలేటి వెంకటరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పున్నాన అక్కలనాయుడు కోరారు. శుక్రవారం పెంట గ్రామ సచివాలయంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. 110 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మక్క శ్రీలత, కంటి వైద్యులు పి.గౌరీ, ఏఎన్ఎం గుణుపూరు భవానీ, ఎంఎల్‌హెచ్‌పీ ఆశపు సుభాషిణి, పంచాయతీ కార్యదర్శి పొట్నూరు సురేష్‌కుమార్, ఆశా కార్యకర్తలు పొగిరి రమాదేవి, వంపూరి మౌళి, బూర రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధితులను ఆదుకుంటాం


బాధితులను పరామర్శిస్తున్న నాయకులు

జి.సిగడాం: సేతుభీమవరంలో ఈ నెల 27న జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బొల్లు నారాయణరావు కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని ఎంపీపీ మీసాల సత్యవతి, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ అన్నారు. శుక్రవారం బాధితులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ నాగవరపు సాయి, మాజీ సర్పంచులు కుదిరెళ్ల వెంకటరావు, పొగతోక రాంబాబు, తొత్తడి అప్పారావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలి అప్పలసూరి, బాతువ పీఏసీఎస్ డైరెక్టర్ పైల త్రినాథరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని మంగువారి తోటలో సంపత్ వినాయక దేవాలయం 11వ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఆరవెల్లి మోహన కృష్ణామాచార్యులు ఆధ్వర్యంలో గణపతి ఆవరణార్చన ఘనంగా జరిగింది. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొండా రాంబాబు, మల్లీశ్వరీదేవి, భక్తులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్ఐ, జేసీఐ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ఎండ తీవ్రత నేపథ్యంలో జేసీస్ శ్రీకాకుళం గ్రీన్ సిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం వన్‌టౌన్ ఎస్ఐ ప్రవల్లిక ప్రారంభించారు. కార్యక్రమంలో సెనేటర్ పి.మధుబాబు, ప్రెసిడెంట్ మణిశర్మ, సాయిబాబా, జేసీఐ సభ్యులు మల్లేశ్వరరావు, లక్ష్మణ్, గణపతి, కిరణ్, జిల్ ఫౌండేషన్ సాయి, న్యూబ్లడ్ బ్యాంక్ మణికంఠ, శివ, ఉమాశంకర్, శ్రీశ్రీ ఫౌండేషన్ శ్రీకాంత్, రమణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు


ఆరోగ్య తనిఖీలు చేస్తున్న డాక్టర్

లావేరు: రావివలస ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం లావేరు పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టరు మణిభూషణ్ ఆరోగ్య తనిఖీలు చేపట్టారు. ఎటువంటి అనారోగ్య సమస్య వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా వైద్య సిబ్బందికి తెలియజేయాలని, మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు



ఎచ్చెర్ల: మండలంలోని కుంచాలకుర్మయ్యపేట దేవీ ఆశ్రమంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఠాధిపతి బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో క్షీరాభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు కుంకుమార్చనలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నారాయణ తిరుమలలో..

ఆధ్యాత్మిక శోభ



- రేపటి నుంచి ఐదు రోజుల పాటు శ్రీవారి కల్యాణోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు


వేంకటేశ్వర స్వామి ప్రధాన ఆలయం (ఇన్‌సెట్లో) బంగారు కవచధారణలో స్వామివారు

శ్రీకాకుళం కల్చరల్ :

ఉత్తరాంధ్ర తిరుమలగా పేరుగాంచిన నారాయణ తిరుమల శ్రీవారి కల్యాణోత్సవాలకు సిద్ధమైంది. జిల్లా కేంద్రంలోని పీఎన్‌కాలనీలో దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలో నడుస్తున్న ఈ ఆలయంలో ఈ నెల 30 నుంచి మే 5 వరకు పాంచరాత్రగమనం ప్రకారం వేంకటేశ్వర స్వామి కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ఆలయ చరిత్ర..

ఒకప్పుడు కొండలు, గుట్టలతో నిండి ఉండే ఈ ప్రాంతంలో గురుగుబెల్లి నారాయణదాసు ఆధ్వర్యంలో 1961 ఏప్రిల్ 21 నుంచి 25 వరకు పాంచరాత్ర ఆగమ ప్రకారం ఆలయ ప్రతిష్ఠాపన జరిగింది. నాటి నుంచి దినదిన ప్రవర్ధమానంగా ఆలయం అభివృద్ధి చెందుతూ వచ్చింది. 48 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం, 52 అడుగుల గరుడాళ్వార్ విగ్రహం, 50 అడుగుల స్వామివారి విశ్వరూప దర్శనం విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.

రూ.50లక్షలతో మహామండప నిర్మాణం

స్వామివారికి కైంకర్యాలను నిర్వహించేందుకు, వెయ్యిమంది భక్తులు ఒకేసారి వేడుకలను వీక్షించేందుకు మహా మండప నిర్మాణం ఆలయం పక్కనే నిర్మించారు. ఇందుకు సుమారు రూ.50 లక్షలు వెచ్చించారు. అక్కడే స్వామివారి కల్యాణ వేడుకలతో పాటు ఇతర ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఆలయం చుట్టూ ఉన్న బేడా మండపాన్ని కూడా సుందరంగా తీర్చిదిద్దారు. చుట్టు దేవతామూర్తులు, స్వామివారి దశావతారాల విగ్రహాలతో అలరారుతోంది. వేంకటేశ్వరస్వామివారి వైభవాన్ని చాటేందుకు భక్తులందరి సహకారంతో స్వామివారికి బంగారు కవచాన్ని, వజ్రకవచాన్ని సమకూర్చారు. వీటిని ప్రత్యేక పర్వదినాలలో అలంకరింపచేసి భక్తులకు కనువిందు చేస్తారు.

మరిన్ని అభివృద్ధి పనులు..

వివిధ కారణాలతో తిరుమలకు వెళ్లలేని భక్తులు ఇక్కడే తలనీలాలు సమర్పిస్తున్నారు. వీరి కోసం శాశ్వత ప్రాతిపదికన కల్యాణ కట్ట నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.2 కోట్ల అంచనాలతో స్వామివారి పుష్కరిణి నిర్మించనున్నారు. ఇందుకు కేటాయించిన స్థలంలో భారీ రాళ్లు ఉండడంతో వాటిని తొలగించి, నిర్మాణం చేస్తున్నారు. ఇక్కడ కూడా దేవతామూర్తుల విగ్రహాలు, మధ్యలో మండపంపైన కాళీయమర్దన బాల శ్రీకృష్ణమూర్తి విగ్రహం ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఆలయం బయట సుందర నందన వనం ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కొంత వరకు పనులు జరిగాయి. మరింత అభివృద్ధి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

కల్యాణోత్సవాలు ఇలా..

- ఈ నెల 30న స్వామివారి విశ్వరూప దర్శనం, క్షీరాభిషేక మహోత్సవం, ఉత్సవ సంకల్పం, మంటపారాధన, సాయంత్రం ధ్వజారోహణం
- మే 1న శ్రీవారి వజ్రకవచ దర్శనం, సాయంత్రం భూనీళా సమేత వేంకటేశ్వరస్వామివారి తిరుక్కల్యాణ మహోత్సవం
- 2న శ్రీవారి రజత కవచ దర్శనం, సాయంత్రం శ్రీవారి గరుడ వాహన సేవ తిరువీధి ఉత్సవం
- 3న వైరముడి కవచన దర్శనం, సహస్రనామార్చన, ఉయ్యాలసేవ
- 4న స్వామివారి స్వర్ణకవచ దర్శనం, సాయంత్రం మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చనలు
- 5న పుష్ప కవచ దర్శనం అవభృత స్నానం, సాయంత్రం పుష్పయాగ మహోత్సవం
- ప్రతిరోజు అఖండ విష్ణు సహస్రనామ పారాయణం.


బేడామండపంలో దేవతామూర్తులు

భక్తుల సహకారంతో అభివృద్ధి..



భక్తుల సహకారంతోనే అభివృద్ధి పనులు చేస్తున్నాం. నారాయణ తిరుమలలో స్వామివారిని దర్శించుకునే వారికి సకల శుభాలు కలుగుతాయి.

– జస్టిస్ గురుగుబెల్లి యతిరాజులు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త

పెరుగుతున్న భక్తుల రద్దీ..



భక్తుల రద్దీ రోజురోజుకూ పెరుగుతోంది. అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నాం. అష్టోత్తర శతనామాలతో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. భక్తుల ఆదరణతో ఆలయ అభివృద్ధి జరుగుతోంది.

– జి.శ్రీనివాసులు, ప్రధాన అర్చకులు

నిత్యాన్నదాన పథకానికి రూ.50 వేలు విరాళం


విరాళం అందజేస్తున్న దాత

గార: శ్రీకూర్మనాథాలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి శ్రీకాకుళం నగరానికి చెందిన దేవీశ్రీ ఎంటర్‌ప్రైజెస్ అధినేత డి.ఇంద్రమోహన్‌వర్మ రూ.50 వేలు విరాళాన్ని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు చేతులమీదుగా అందజేశారు. ఈ చెక్‌ను ఈవో గురునాథంకు శుక్రవారం అందజేశారు. ఇప్పటికే రూ.1,22,333 అందజేశారని ఈవో తెలిపారు. రాగోలు అప్పలరాము రూ.10 వేలు విరాళాన్ని మంత్రి చేతుల మీదుగా అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు డబ్బీరు వాసుదేవరావు, అనుపోజు నాగరాజు, బోర కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి


విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం రూరల్: కేంద్రీయ విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆకాంక్షించారు. పెదపాడు పరిధిలోని కేంద్రీయ విద్యాలయంలో శుక్రవారం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రీయ విద్యాలయానికి దేశంలోనే ప్రాముఖ్యత ఉందని, అందుకు అనుగుణంగా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకోవాలని వాటి సాధనకు అహర్నిశలు పట్టుదలతో చదవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన

అరసవల్లి పాలక మండలి సభ్యులకు సత్కారం


పాలక మండలి సభ్యులను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానం పాలక మండలి సభ్యులకు గురువారం సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో సన్మానం చేశారు. సమితి అధ్యక్షుడు ఇప్పిలి శంకరశర్మ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు, సమితి గౌరవాధ్యక్షుడు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, మండవిల్లి రవిలను అభినందించారు. కార్యక్రమంలె సమితి అధ్యక్ష కార్యదర్శులు ఇప్పిలి శంకరశర్మ, గుత్తు చిన్నారావు, కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాసరావు, నక్క శంకరరావు, మురళి, ఉపాధ్యక్షులు కిల్లాన ఫల్గుణరావు, పార్థసారధి, పోలినాయుడు, నీరజ సుబ్రహ్మణ్యం, వరలక్ష్మి, పూజ, సురేష్, పి.వి.ఆర్ మూర్తి, పి.ఎ.ఎస్.శాస్త్రి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న యూబీ ఒప్పంద కార్మికుల ధర్నా


సంఘీభావం తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రణస్థలం: అర్ధాంతరంగా నిలుపుదల చేసిన ఒప్పంద కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ బంటుపల్లి యూబీ పరిశ్రమ ఎదుట రెండో రోజు శుక్రవారం ఒప్పంద కార్మిక కుటుంబ సభ్యులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావులు మాట్లాడుతూ ఆర్డర్లు లేవనే సాకుతో ఒప్పంద కార్మికులను పనికి దూరం చేయడం తగదన్నారు. కార్మికులకు న్యాయం చేయకపోతే పోరాటం ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పైడి శ్రీనివాసరావుతో పాటు పలువురు ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. యూబీ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఐ.నారాయణరావు, జె.గంగరాజు, సత్యనారాయణ, కార్మిక కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

తెల్లదోమ నివారణకు క్షేత్రస్థాయి శిక్షణ


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన శాఖ అధికారి ప్రసాద్

రణస్థలం: కొబ్బరి తోటలను విపరీతంగా నష్టపరిచే రూగోస్ తెల్లదోమను తొలిదశలోనే గుర్తించి తగిన నివారణా చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యానశాఖ అధికారి ఆర్.వి.వి.ప్రసాద్ అన్నారు. శుక్రవారం వల్లభరావుపేటలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులకు కొబ్బరిలో రూగోస్ తెల్లదోమ నివారణ, సస్యరక్షణ చర్యలపై క్షేత్రస్థాయి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెల్ల దోమ వేసవిలో ప్రారంభమై శీతాకాలంలో సంతతి వృద్ధి చేసుకుంటుందన్నారు. దీని ప్రభావంతో కొబ్బరితో పాటు అనేక పంటల్లో దిగుబడులు గణనీయంగా తగ్గుతాయని చెప్పారు. దీని నివారణకు 10వేల పీపీఎం సామర్థ్యం గల వేపనూనె లీటరు నీటికి మిల్లీ లీటర్ చొప్పున కలిపి ఆకు దిగువ భాగం తడిచేలా పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ వి.హరికుమార్, వ్యవసాయ సహాయ సంచాలకులు వి.శ్రీనివాసరావు, ఏఓ విజయ భాస్కర్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ ఆర్.హరిబాబు, హెచ్‌వో అనుషా తదితరులు పాల్గొన్నారు.

'మన్ కీ బాత్'కు ఏర్పాట్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రధాని మోదీ మనసులో మాట (మన్ కీ బాత్) కార్యక్రమం 100వ ఎపిసోడ్ శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించేందుకు బీజేపీ నాయకులు విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆదివారం ఉదయం 11 గంటలకు హిందీ, 11.30 గంటలకు తెలుగులో ప్రసారం అయ్యే రేడియో ప్రసంగాన్ని జిల్లా వ్యాప్తంగా శక్తి కేంద్రాలు ఆధారంగా 100 మందితో మన్ కీ బాత్ అందరూ వినేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పైడి వేణుగోపాలం తెలిపారు.

చిన్నారావుకు ఎన్టీఆర్ జీవనసాఫల్య పురస్కారం


పురస్కారం అందుకుంటున్న గుత్తు చిన్నారావు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణానికి చెందిన ప్రముఖ రంగస్థల కళాకారుడు గుత్తు చిన్నారావుకు ఎన్టీఆర్ జీవన సాఫల్య పురస్కారం లభించింది. గురువారం విశాఖలో విశాఖరత్న కళాపరిషత్, దాసరి కల్చరల్ అకాడమీ సంయుక్త నిర్వహణలో వివిధ రంగాలలో ప్రతిభావంతులకు పురస్కారాలు ప్రదానం చేశారు. కళ, సాంస్కృతిక, నాటక రంగాలలో రెండు దశాబ్దాలుగా విశేష సేవలు అందిస్తున్న చిన్నారావును ఈ అవార్డుతో సత్కరించారు. ఈయన పురస్కారం అందుకోవడం పట్ల సుమిత్రా కళాసమితి, గాంధీ మందిరం కమిటీ, లయన్స్‌క్లబ్, రంగస్థల కళాకారుల సమాఖ్య సభ్యులు అభినందించారు.

ఎస్ఎస్ఆర్ పురంలో వైద్య శిబిరం


వైద్యసేవలు అందిస్తున్న సిబ్బంది

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం జాతీయ సేవాపథకం యూనిట్-6 ప్రత్యేక సేవాశిబిరం ఎస్ఎస్ఆర్‌పురంలో కొనసాగుతుంది. శుక్రవారం రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. 152 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త అనురాధ, పీవో జి.స్వాతి, సర్పంచ్ దుంప అప్పయ్యమ్మ పాల్గొన్నారు.

అరిణాంఅక్కివలసలో ముగిసిన యూనిట్ –2 శిబిరం..

అరిణాంఅక్కివలసలో అంబేడ్కర్ వర్సిటీ జాతీయ సేవాశిబిరం–2 ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రత్యేక సేవాశిబిరం శుక్రవారంతో ముగిసింది. కార్యక్రమంలో సర్పంచ్ అంబటి శ్రీనివాసరావు, పీఓ డి.తాతారావు, ఎంపీటీసీ మాడుగుల స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా సంక్షేమ వెలుగులు

- ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్


రణస్థలంలో మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: అర్హత కలిగిన ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందడంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని రణస్థలం గ్రామ సచివాలయ పరిధిలో రామదాసుపేట, చినలంకపేట గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి లబ్ధిదారులతో మాట్లాడారు. సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందించి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పార్టీలకు అతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అందిస్తున్నారని చెప్పారు. పథకాలు కొనసాగాలంటే జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పిన్నింటి సాయికుమార్, జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, మండల నాయకులు లంకలపల్లి ప్రసాద్, మహంతి పెదరామినాయుడు, చిల్ల వెంకటరెడ్డి, గొర్లె అప్పలనర్సునాయుడు, పిల్ల ఆనందరావుపాత్రుడు, మహంతి చినరామినాయుడు, కరిమజ్జి భాస్కరరావు, మహిళా అధ్యక్షురాలు గురాన మానస, రణస్థలం మాజీ సర్పంచ్ పిన్నింటి లక్ష్మునాయుడు, మహంతి గురునాయుడు, పసుపురెడ్డి సురేష్, మహంతి జోగినాయుడు, భాస్కరరావు, గొర్లె కోటేశ్వరరావు, కెల్ల కోటేశ్వరరావు, లంక రాములు, లంక రమణ, లంక లచ్చుము, పండువాడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అరసవల్లి: శ్రీకాకుళం నగర పరిధిలోని 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల నేపథ్యంలో శ్రీకాకుళం నగరంలోని పలుచోట్ల విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. ఆర్ట్స్ కాలేజ్ రోడ్, డే అండ్‌నైట్ జంక్షన్, రైతు బజార్, చిన్నబజార్, ఇల్లీసుపురం, సాలివీధి, సానావీధి, పరంకుసనగర్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 7 నుంచి 9.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు డివిజనల్ ఈఈ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.

రణస్థలం: పాతర్లపల్లి సబ్ స్టేషన్‌లోని మరువాడ ఫీడర్ పరిధిలో మరమ్మతుల నేపథ్యంలో దేరసాం, మరువాడ, ఉప్పివలస గ్రామాలకు శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.బయన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించగలరని కోరారు.

బాలల సేవలపై ఆరా


శిశుగృహలో రికార్డులు పరిశీలిస్తున్న అప్పారావు

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసల అప్పారావు, సభ్యులు గొండు సీతారాం శుక్రవారం శ్రీకాకుళంలోని బాలసదనం, శిశుగృహ, బెహరా మనోవికాస కేంద్రాలను సందర్శించారు. పిల్లలకు అందుతున్న సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్లు పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు.

కార్యక్రమంలో జిల్లా బాలల రక్షణ అధికారి కె.వి.రమణ, రక్షణ అధికారి మల్లేశ్వరరావు, కౌన్సిలర్ సీతారాములు, ఏహెచ్‌టీయూ ఎస్ఐ వెంకటరావు, కానిస్టేబుల్ గోవిందరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పౌష్టికాహారం వితరణ


పౌష్టికాహారం అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు జిల్ ఫౌండేషన్ – న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో దివంగత జాడ శ్రీదేవి జ్ఞాపకార్థం పౌష్టికాహారం, పుస్తకాలు పంపిణీ చేశారు. శ్రీకాకుళంలోని లైఫ్ హాస్పిటల్ వేదికగా జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ సాహిత్య చిన్నారులకు అవసరమైన వైద్యసేవలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనూరాధ, డీపీఆర్‌ఓ సింగ్, డాక్టర్ దానేటి శ్రీధర్, డాక్టర్ సనపల చంద్రశేఖర్, జిల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ సూరాడ సత్యసాయి, వైస్ ప్రెసిడెంట్ జాడ సాయి, కన్వీనర్ కొమ్మాన శివప్రసాద్, బ్లడ్ బ్యాంక్ మేనేజర్ టి.మణికంఠ, మంత్రి వెంకటస్వామి, జేసీఐ గ్రీన్ సిటీ ప్రెసిడెంట్ మణిశర్మ, సభ్యులు ఉమాశంకర్, వీరభద్ర పాల్గొన్నారు.

బాలకార్మికుల గుర్తింపు


నిర్వాహకులతో మాట్లాడిన ఏహెచ్‌టీయూ పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని గుజరాతీపేటలో పలు దుకాణాల్లో పనిచేస్తున్న ముగ్గురు బాలకార్మికులను శుక్రవారం గుర్తించినట్లు మానవ అక్రమ రవాణా విభాగం(ఏహెచ్‌టీయు) ఎస్ఐ ఎస్.కేశవరావు చెప్పారు. మెకానిక్‌షెడ్, జిలేబీ దుకాణం, స్క్రాప్ దుకాణాల్లో ఒక్కో బాలకార్మికుడిని గుర్తించి సీడబ్ల్యూసీ ముందు హాజరుపర్చే నిమిత్తం చైల్డ్‌లైన్ సిబ్బందికి శనివారం అప్పగించనున్నట్లు చెప్పారు. 18 ఏళ్లలోపు బాలలను పనిలో పెడితే కేసులు నమోదు చేస్తామని యజమానులకు హెచ్చరించారు. గురువారం సాయంత్రం కృష్ణాపార్కు సమీపంలో జబ్బావీధికి చెందిన ఇంటర్మీడియట్ మొదటిసంవత్సర విద్యార్థిని డేఅండ్‌నైట్ సమీపంలోని నాగావళి నది వంతెన వద్ద అనుమానంగా కనిపించడంతో ఎస్ఐ కేశవరావు, ఏఎస్ఐ జగన్నాధరావులు రెండో పట్టణ పోలీసుల సమక్షంలో చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేశారు.

వెంకన్నకు కిరణస్పర్శ



ఎచ్చెర్లలో జాతీయ రహదారికి ఆనుకొని కొండపై ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయం గర్భగుడిలో స్వామివారిని శుక్రవారం ఉదయం 5:40 గంటల సమయంలో సూర్య కిరణాలు స్పృశించాయి. మూడు రోజుల నుంచి కిరణాలు తాకుతుండగా, శుక్రవారం పరిపూర్ణంగా కొన్ని నిమిషాలు పాటు తాకడంతో భక్తులు పారవశ్యం చెందారు.

– ఎచ్చెర్ల క్యాంపస్